హామీలు అమలు చేయాలి

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత
- సారంగాపూర్ మండలం పోచంపేటలో పర్యటన

బీడీ కార్మికులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, మార్చి 12: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. మండలంలోని పోచంపేట గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. బీడీ కార్మికులు, మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఎన్నికల ముందు మహిళలకు ప్రతి నెల రూ. 2500 చొప్పున నగదు, 18 ఏళ్లు నిండిన మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా నగదు ప్రోత్సాహకంతో పాటు తులం బంగారం, బీడీ కార్మికులకు పింఛన్ రూ. 4 వేలు ఇస్తామని చెప్పి ఏఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని, రాబోయే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కుర్మ సంఘం పెద్దమనిషి ఏనుగుల ఒక్కపొద్దు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తేలు రాజు, నాయకులు గంగారెడ్డి, శ్రీనివాస్, రమేశ్, మల్లేశ్, గంగాధర్, నరేశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్, మెట్‌పల్లి, జగిత్యారూరల్ పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉన్న మాజీ సర్పంచులు

మాజీ సర్పంచుల అరెస్టు

వెల్గటూర్/మల్లాపూర్/మెట్‌పల్లి రూరల్, మార్చి 12: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ, తమకు బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో బోడకుంటి రమేశ్, బాలసాని రవిగౌడ్, గాగిరెడ్డి లింగమ్మ-రాజేశ్వర్‌రెడ్డి, చల్లూరి స్వరూప-రాంచందర్, తదితరులున్నారు. మల్లాపూర్, మెట్‌పల్లి మండలాల్లో మాజీ సర్పంచులు వనతడపుల నాగరాజు, భూక్యా గోవింద్‌నాయక్, సయ్యద్ హైదర్, తదితరులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

విద్యార్థులతో బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు

జగిత్యాల టవర్ సర్కిల్, మార్చి 12: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములవ్వాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (నిజామాబాద్) రీజినల్ హెడ్ అరుణ సవిత కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని మహిళా, ఎస్సీ వసతి గృహాలకు 5 నీటి శుద్ధి యంత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి అరుణ సవిత మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, ఎల్‌డీఎం రాంకుమార్, యూబీఐ మేనేజర్లు, ఎఫ్ఎల్సీ కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

14న అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి, మార్చి 12: మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 14న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 23న హైదరాబాద్‌లోని స్పోర్ట్ పాఠశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులతో మెట్‌పల్లిలోని స్టేడియంకు రావాలని కోరారు.

వృద్ధురాలి అదృశ్యం

కథలాపూర్, మార్చి 12: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన బద్దనపెల్లి బావాయి (56) అదృశ్యమైనట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. బావాయి ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. బావాయి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

వెల్గటూర్, మార్చి 12: ఎండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సామాజిక సేవకుడు సప్ప రవి పరీక్ష సామగ్రి అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ఉమాసాగర్ మాట్లాడుతూ, విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, పక్కన వివిధ శాఖల అధికారులు

జగిత్యాల, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు సహకరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ కమిటీ (డీసీసీ) త్రైమాసిక సమీక్షా సమావేశం నిర్వహించగా, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. జిల్లా బ్యాంకింగ్ రంగ ప్రగతిని సమీక్షించడంతో పాటు ప్రాధాన్యత రంగాలకు రుణాల మంజూరు, వార్షిక క్రెడిట్ ప్లాన్ అమలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఆర్బీఐ ఎల్డీవో పృథ్వీ, వివిధ శాఖల అధికారులు రాజ్ కుమార్, డాక్టర్ నరేశ్, డాక్టర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల/జగిత్యాలటౌన్, మార్చి 12: పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఆయన చాంబర్ నుంచి అన్ని మండలాల ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు, విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. మండలాల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు రుసుము చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు భయాందోళన చెందవద్దని, నిర్భయంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో మదన్‌మోహన్, జిల్లా విద్యాధికారి రాము, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 12: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. ఆలయంలో యజ్ఞాచార్యులు, వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. స్వామివారికి భక్తులు పట్టెనామాలు, కోరమీసాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను సేవపై ఉంచి మేళతాళాల మధ్య దేవస్థానం నుంచి గోదావరి ఒడ్డున గల రామాలయం, పురవీధుల గుండా కోనేరు నుంచి దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీ బాధితుల ఆందోళన

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 12: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టించిన వ్యక్తి ఇంటి ఎదుట బుధవారం బాధితులు ఆందోళన చేపట్టారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే లాభాలు రెట్టింపు అవుతాయని జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి లక్షలు పెట్టుబడి పెట్టామని, లాభాలు రాకపోగా పెట్టుబడి పెట్టిన సొమ్ము కూడా రాలేదని, తమ డబ్బులు తమకు ఇప్పించాలని సదరు వ్యక్తి ఇంటికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఆ వ్యక్తి ఇంట్లో లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పాఠశాలల్లో ఏఐ ద్వారా విద్యా బోధనకు శ్రీకారం

జగిత్యాల టౌన్, మార్చి 12: ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా విద్యా బోధనకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా విద్యాధికారి రాము తెలిపారు. జిల్లాలో మొదటి విడుతలో 21 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ఆయా పాఠశాలల ఎంఈవోలు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఆయా పాఠశాలల్లో ఈనెల 15 నుంచి మండల విద్యాధికారులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పర్యవేక్షణలో విద్యా బోధన చేస్తారని తెలిపారు.

తైబజార్ రద్దు చేయాలని వినతి

రాయికల్, మార్చి 12: రాయికల్ పట్టణంలో తైబజార్‌ను రద్దు చేయాలని కోరుతూ చిరు వ్యాపారులు బుధవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న తమను ఇబ్బందులకు గురి చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని, గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాలలో తైబజార్‌ను రద్దు చేశారని, అదే విధంగా రాయికల్‌లో కూడా తైబజార్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మ్యాకల రమేశ్, మాజీ సర్పంచ్ ఎద్దండి భూమారెడ్డి, నియోజకవర్గ యూత్ కో ఆర్డినేటర్ కొయ్యడి మహిపాల్, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, బత్తిని భూమయ్య, షాకీర్, కడకుంట్ల నరేశ్, బత్తిని నాగరాజు, రాకేశ్ నాయక్, బొమ్మకంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

వెల్గటూర్, మార్చి 12: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన సంగ శ్రీనివాస్ (48) మంగళవారం రాత్రి బైక్‌పై పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో అడవిపంది అడ్డు రావడంతో బైక్‌పై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ కుమారుడు విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల టవర్ సర్కిల్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని రామ ఆయిల్ మిల్లు (పల్లిగిర్ని), కట్టమీద రమేశ్ కిరాణం ఏరియా, బైపాస్ పాత మంగళి సంఘం ఏరియాకు గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాద్రినగర్ ఏరియాకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నల్లా నీళ్లు ఇలా.. తాగేదెలా..?

రంగుమారిన నల్లా నీరు

జగిత్యాల, మార్చి 12 : జగిత్యాల పట్టణంలోని 13వ వార్డు (సుతారిపేట)లో కొద్ది రోజులుగా మున్సిపల్ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీళ్లు రంగు మారి వస్తుండడంతో ప్రజలు తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, మున్సిపల్ కమిషనర్ స్పందించి శుద్ధజలం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

అర్థిక సాయం అందజేత

కొడిమ్యాల, మార్చి 12: మండల కేంద్రానికి చెందిన చొక్కల సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. దవాఖానకు తుడి లచ్చన్న యువసేన సభ్యులు బుధవారం వెళ్లి రూ. 10 వేల నగదు అందజేశారు. నాయకులు కూనవేని రాజశేఖర్, బైరి శ్రీధర్, బల్ల పోచమల్లు, బల్ల లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులను అడ్డుకోవడం అప్రజాస్వామికం

జగిత్యాల రూరల్, మార్చి 12: సీఎంను కలిసి తమ సమస్యలు చెప్పుకొని వినతి పత్రం అందించడానికి వెళ్తున్న మాజీ సర్పంచులను అడ్డుకొని, అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అసమర్థపాలన కొనసాగుతున్నదని, ప్రజాపాలనలో ప్రశ్నిస్తే అరెస్టు చేయడమే అనే ధోరణి కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్నదన్నారు. జగిత్యాల రూరల్ మండలంలో మాజీ సర్పంచులు బుర్ర ప్రవీణ్ గౌడ్, జక్కుల తిరుపతి, గంగనర్సు, రాజన్న, జాన్, గంగాధర్ గౌడ్‌ను అరెస్టు చేశారని పేర్కొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జగిత్యాల/సారంగాపూర్, మార్చి 12: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గొల్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఉదయం మోకు తెగడంతో తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే, కండ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్ చంద్రయ్య, బీర్‌పూర్‌కు చెందిన కడకుంట్ల తిరుపతి అనారోగ్యంతో బాధపడుతుండగా వెళ్లి పరామర్శించారు.

గ్రూప్-1 ఫలితాల్లో బతికపల్లివాసి ప్రతిభ

స్నేహ

పెగడపల్లి, మార్చి 12: పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన గాలిపెల్లి స్నేహ గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 517 మార్కులతో 485వ ర్యాంక్ సాధించింది. స్వర్ణకారుడైన రాజమౌళి-అనూష దంపతుల కూతురు స్నేహ ఇది వరకే ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తూనే, గ్రూప్-1కు సన్నద్ధమైంది. మొదటి ప్రయత్నంలోనే 485వ ర్యాంక్ సాధించడం పట్ల ఆమెను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు

మల్యాల(కొడిమ్యాల), మార్చి 12: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంతరావు, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్, అర్చకులు కఫీందర్, రామకృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధమైన రంగుల తయారీ

జగిత్యాల టౌన్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులు ప్రకృతి సిద్ధమైన రంగులు తయారు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర అధ్యాపకుడు సాయి మధుకర్ మాట్లాడుతూ, హోళీ పండుగ రోజున కృత్రిమంగా తయారు చేసిన రంగులు వాడితే అనారోగ్య సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినులు తయారు చేసిన రంగులను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్డీవో రఘువరన్

కొడిమ్యాల, మార్చి 12: వేసవిలో ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఏపీవో సతీశ్, ఈసీ రఘుపతి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, కార్యదర్శి మహేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలకు అడ్డాగా జగిత్యాల దవాఖాన

- రోగుల మధ్య స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు

దవాఖానలో తిరుగుతున్న ఎలుకలు

జగిత్యాల, మార్చి 12: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన ఎలుకలకు అడ్డాగా మారింది. రోగుల మధ్య నిత్యం స్వైర విహారం చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చికిత్స కోసం వచ్చే రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అతడిని చూసేందుకు మంగళవారం రాత్రి దవాఖానకు స్నేహితులు వచ్చారు. రాత్రివేళలో దవాఖానలో ఎలుకల స్వైరవిహారం చేయడం, కరెంట్ పోయినా జనరేటర్ వేయకపోవడంతో అవాక్కయ్యారు. వెంటనే ఈ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతంలో జరిగిన ఘటనలకు ప్రాయశ్చిత్తంగా.. దవాఖానలో మెరుగైన వైద్యసేవలు అందిస్తారనుకుంటే.. నానాటికి దిగదిగుడుపే అనే చందంగా రోజుకో ఘటన బయటకు వస్తున్నాయంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జిల్లా దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యంతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్, మార్చి 12: మండలంలోని రామాజీపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. 24 బస్తాల్లో నిల్వ చేసిన 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక డీలర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయ్ డీటీ వరప్రసాద్, ఎఫ్ఏ రాజేంద్రప్రసాద్, పద్మయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సంఘ బాధ్యులు

కోరుట్ల, మార్చి 12: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసిన అబ్దుల్ ముజీబ్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులకు పీఆర్టీయూ (టీఎస్) తరపున సంఘం ప్రతినిధులు బుధవారం రూ. లక్ష చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ వాజిద్, జక్కుల నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుధీర్, మహేశ్, శ్రీనివాస్, ధరందీప్, సైఫొద్దీన్, యూసుఫ్‌అలీ, ఆంజనేయులు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీజీవోప రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో

రాష్ట్ర అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

పెగడపల్లి, మార్చి 12: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇప్పటికే ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీనివాస్‌రెడ్డి, టీజీఏవో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికవడం పట్ల జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వనరులను కాపాడాలి

జగిత్యాల రూరల్, మార్చి 12: జిల్లాలో గల్ఫ్ బాధితులను పరామర్శించడానికి వచ్చిన మైనింగ్ విభాగం చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను బుధవారం మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రకృతి వనరులను కాపాడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోట జగన్, యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఖనిలో 'స్వచ్ఛంద' పెళ్లి సందడి

కోల్‌సిటీ, మార్చి 12: గోదావరిఖనిలో 'స్వచ్ఛంద' పెళ్లి సందడి మార్మోగింది. రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఓ నిరుపేద అమ్మాయి పెళ్లిని అన్ని లాంఛనాలతో సవ్యంగా జరిపించారు. రామగుండం ఎన్టీపీసీకి చెందిన తాళ్లపల్లి జోగయ్య-జయ దంపతులకు ముగ్గురు కుమార్తె లు. పెద్ద కుమార్తె కరుణకు వివాహం నిశ్చ యం కాగా, నిరుపేద కుటుంబం కావడంతో కూతురి పెళ్లిపై బెంగ పెట్టుకున్న ఆ కన్నవారికి రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక సభ్యులు అండగా నిలిచారు. పెళ్లి బాధ్యతలు తీసుకొని తమవంతుగా సాయం చేయడంతో పాటు గత నెల రోజులుగా దాతల నుంచి విరాళాలు సేకరించారు. బుధవారం గోదావరిఖని శివారులోని శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వివాహ మహోత్సవం కనుల పండువగా జరిపించారు. వధూ వరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. బంధువులు కూడా పెళ్లికి సాయం చేయలేని ఈ రోజుల్లో తమకెలాంటి రక్త సంబంధం లేకపోయినా అంతకంటే ఎక్కువగా ముందుండి తమ కుమార్తె పెళ్లి జరిపించారంటూ ఆ అమ్మాయి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కోల్‌బెల్టు వాతావరణంకు పూర్తి భిన్నంగా స్వచ్ఛంద సంఘాల సభ్యులు ఆదర్శంగా నిలిచారు. వేదిక సభ్యులు చంద్రకళ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల రూరల్, మార్చి 12: మండలంలోని కల్లూరు ఆదర్శ పాఠశాలలో 6, 7, పదో తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కోరుట్ల, మార్చి 12: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పద